క్లుప్తంగా

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



రామేశ్వరం పాఠశాలలో చేరిన విద్యార్థులకు అడ్మిషన్ ఫారాలు అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

పెదపూడి: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి సీవీవీ సత్యానారాయణ అన్నారు. రామేశ్వరం, ఏపీ త్రయం గ్రామాల్లో నేను బడికి పోతా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో పర్యటించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రజలను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకున్న ఐదుగురు విద్యార్థులను రామేశ్వరం ఎస్సీ పేట పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, జ్యోతిర్మయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్రాంత తహసీల్దార్‌కు సన్మానం



సత్యనారాయణరాజును సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

సీతానగరం: విశ్రాంత తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజును గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నెల్సన్ పాల్ బాబు మాట్లాడుతూ సత్యనారాయణరాజు సేవలు అభినందనీయమని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. సత్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం ద్వారా మంచి తృప్తి కలుగుతుందని, విధి నిర్వహణలో విలువలు పాటిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మి, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనేక అనర్థాలు



మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న సీఐ బంగారు రాజు

మధురపూడి: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ బంగారురాజు అన్నారు. కోరుకొండలోని సృజన మోడల్ జూనియర్ కాలేజీలో గురువారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ బంగారురాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. కాలేజీ కరస్పాండెంట్ ఏడుకొండలు మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలనే లక్ష్యంగా విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.


పాఠశాలల పరిశీలన

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను గురువారం రాజమహేంద్రవరం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ పరిశీలించారు. అక్కడ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్లను పరిశీలించారు.

ఒత్తిడిపై యోగాస్త్రం

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

బిక్కవోలు: క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. యోగాసనాల వల్ల ఆరోగ్యం బాగుండటమే కాదు ఆయుష్షు సైతం పెరుగుతుందని యోగా నిపుణులు చెబుతున్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా యోగా సహకరిస్తుండడంతో అందరికీ యోగాపై ఆసక్తి పెరిగింది. మారుతున్న కాలంలో ప్రతి మనిషి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఒత్తిడి. అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ రుగ్మతను తగ్గించడానికి యోగా ముఖ్యమైన ఔషధంగా మారింది. మనసుపై, శరీరంపై పట్టు సాధించడమే యోగాభ్యాసం అంతిమ లక్ష్యమని సాధకులు అంటుంటారు. దేహం, మనసు, భావోద్వేగాలను సమతుల్యం చేయడమే యోగమని విశ్లేషిస్తున్నారు. ఒత్తిడిని తగ్గించి ఆనందకర జీవనానికి తోడ్పడే సనాతన భారతీయ జీవన విధానంలో భాగమైన యోగ విశిష్టతను తెలియజేసేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యోగాభ్యాసం సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందని, ఒక్కో ఆసనం ద్వారా ఒక్కో ఉపయోగం ఉంటుందని యోగా నిపుణులు చెబుతున్నారు.



పందలపాకలో యోగా చేస్తున్న విద్యార్థులు

మంచి ఆరోగ్యానికి యోగా



ఉరుకుల పరుగుల నేటి సమాజంలో అందరినీ ఒత్తిడి వెంటాడుతుంది. దీనివల్ల లేనిపోని రోగాలు వస్తున్నాయి. యోగా నేర్చుకోవడం వల్ల శరీరంలోని ప్రతి అవయవానికి కదలిక ఏర్పడి కొత్త శక్తి వస్తుంది.

– సబెళ్ల పురుషోత్తమరెడ్డి, యోగా గురువు, బలభద్రపురం

రోజంతా ఉల్లాసం



రోజూ ఉదయం, సాయంత్రం కొంత సమయం యోగా చేయడం వల్ల ఆ రోజంతా ఉల్లాసంగా ఉంటారు. అన్ని వయసుల వారు యోగా చేయొచ్చు. విద్యార్థులు యోగా చేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుంది.

– దార్వంపూడి యువరాజారెడ్డి, యోగా గురువు, పీడీ, పందలపాక ఉన్నత పాఠశాల

ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించుకోవాలి



నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రతి ఒక్కరూ నీటి వృథాని అరికట్టి సంరక్షించుకోవాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెద్దాడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సేవ్ ద వాటర్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో భూగర్భ జలలు అడుగంటి పోతున్నాయన్నారు. అనేక మహానగరాల్లో తాగునీరు అందక ప్రజలు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూస్తున్నామన్నారు. భవిష్యత్త తరాలకు తాగునీరు అందాలంటే ఇప్పటి నుంచి నీటిని వృథా చేయకుండా సంరక్షించాలన్నారు. విద్యార్థి దశ నుంచే నీటి సంరక్షణపై అవగాహన పెంచుకుని భూగర్భ జలాలు అడుగంటి పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఐ విజయ్ కుమార్, ఎస్‌బీఐ అధికారి శేషగిరి

సీతానగరం: మునికూడలి ఎంపీపీ స్కూల్–1 లోని విద్యార్థులకు రాజమహేంద్రవరం డివిజన్ సీఐడీ విభాగం సీఐ దార్ల విజయ్ కుమార్, మెయిన్ ఎస్‌బీఐ హోమ్ లోన్ విభాగంలో పనిచేస్తున్న డి.శేషగిరి గురువారం నోట్ పుస్తకాలు, పలకలు, ఇతర సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.నాగమణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్‌బీఐ అధికారి శేషగిరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సహకారం, ప్రోత్సాహం అందిస్తే ఉన్నత శిఖరాలకు చేరకుంటారన్నారు. అనంతరం దాతలను హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరిస్తున్న సెబ్ సీఐ రాంబాబు

రంగంపేట: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సీఐ ఎస్.రాంబాబు సూచించారు. మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.మాధురి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.రాంబాబు మాట్లాడుతూ నార్కోటిక్ డ్రగ్స్ అనగా గంజాయి, నల్ల మందు, బ్రౌన్ షుగర్, మరియు సింథటిక్ డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ అలవాటు అత్యంత ప్రమాదకరమన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడినవారి మెదడు మొద్దుబారి విచక్షణ కోల్పోతారని చెప్పారు. అందుకే మాదక ద్రవ్యాల వైపు యువత ఆకర్షితులు కావొద్దని, జీవితంలో లక్ష్యం ఏర్పరచుకుని అది సాధించేందుకు కృషి చేయాలన్నారు. మత్తు, మరియు మాదక ద్రవ్యాల సమాచారాన్ని 14500 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలన్నారు. మత్తు పదార్థాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ చిన్నారావు మాట్లాడుతూ నార్కోటిక్ డ్రగ్స్ వాడటం వల్ల అనారోగ్యం పాలై వారి నరాల వ్యవస్థతో పాటు కాలేయం, గుండె, ఊపిరితిత్తులు వంటి అవయవాలు పాడైపోయి మరణిస్తారన్నారు. ఇటువంటి చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధురి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులు, పెద్దలు చెప్పే విషయాలు అర్థం చేసుకుని మంచి సమాజం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ జి.అనిల్, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలపై అవగాహన కల్పించాలి

బిక్కవోలు: రెవెన్యూ శాఖ ద్వారా అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ బి.కన్యాకుమారి అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1772 మే 14వ తేదీన బెంగాల్ గవర్నర్ అయిన వారన్ హేస్టింగ్ భూశిస్తు వసూలు చేయడానికి జిల్లాకు ఒక కలెక్టర్‌ను నియమించారన్నారు. 1786 జూన్ 20న మద్రాసు రాష్ట్రంలో రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధ్రువీకరణ పత్రాలు, నీటి పన్నుతో సహా రెవెన్యూ సేవలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విశ్రాంత వీఆర్వో వద్దాది రామకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీటీ కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, చిట్టిబాబు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ దినోత్సవంలో పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది

రెవెన్యూ విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

రాజానగరం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశంలో రెవెన్యూ వ్యవస్థ ఏర్పడి 250 ఏళ్ల పూర్తి కావడం, పరిపాలనకు మార్గదర్శిగా మారి ప్రగతిలో కీలకంగా మారడం, రెవెన్యూ వ్యవస్థ ద్వారానే ఎన్నో సమస్యలు సత్వర పరిష్కారానికి నోచుకుంటున్నాయనే భావాన్ని వ్యక్తపరుస్తూ పలువురు వక్తలు తమ ప్రసంగాలలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: రెవెన్యూ శాఖ ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లతీఫ్ పాషా కోరారు. మండల కేంద్రమైన రంగంపేట పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ డే సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ఆయన మాట్లాడారు.

జూన్ 20వ తేదీన రెవెన్యూ డేగా జరుపుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న అడంగల్, ఆర్ఎస్ఆర్, వన్‌బీ తదితర సేవలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రంగంపేటలో రెవెన్యూ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లతీఫ్ పాషా



రాజానగరంలో రెవెన్యూ విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సిబ్బంది

'రీచ్ యువర్ పంచాయతీ'తో రైతులకు సేవలు

రాజానగరం: వ్యవసాయంలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా ప్రతి పంచాయతీకి శాస్త్రవేత్తలు చేరువ కావాలనే ఆశయంతో వ్యవసాయ విశ్వవిద్యాలయం 'రీచ్ యువర్ పంచాయతీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు తెలిపారు. పెరవలి మండలం కానూరులో గురువారం నిర్వహించిన రీచ్ యువర్ పంచాయతీ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను స్థానిక విలేకరులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతు సదస్సులు, సమావేశాలు నిర్వహించి సార్వాకు సంబంధించి నారుమడి యాజమాన్యం, విత్తనశుద్ధి, ఎరువుల వాడకంపై అవగాహన కలిగిస్తూ, అనుమానాలను నివృత్తి చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన బుక్‌లెట్లను రైతులకు అందజేశారు. అలాగే ఎలుకల నివారణ, మానిపండు తెగులు నివారణ, చీడపీడల యాజమాన్యంపై వీఏఏలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ ఎస్.హైమజ్యోతి, వ్యవసాయాధికారులు ఎ.మేరీ కిరణ్, సర్పంచ్ మధుపూర్ణచందు, ముళ్లపూడి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



రైతులకు వ్యవసాయ బుక్‌లెట్లు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

రైతులకు అన్ని విధాలా సహకారం

మధురపూడి: ఖరీఫ్ సాగుకు సమాయత్తమైన రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించడానికి సిబ్బంది సిద్ధం కావాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు అన్నారు. కోరుకొండలోని సమీకృత పరీక్షా కేంద్రంలో సిబ్బందికి గురువారం ఆయన పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి నమూనాలను త్వరితగతిన సేకరించాలన్నారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ సందర్భంగా పలు మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, గోకవరం ఏవో రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాలు మెరుగు



రంగంపేట హైస్కూల్లో విద్యార్థులకు ఇంకుడు గుంతపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట: ఇంకుడుగుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలు మెరుగు పడతాయని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని, వాడుక నీటిని పెరటి మొక్కలకు, ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా చర్యలు చేపడితే భూగర్భ జలాలు పెంచుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించడంలో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత తవ్వి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నీటి పొదుపుపై నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయిని రమ్యసుధ, వీసీ జాకబ్, భారతి, సత్యదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

కంబాలచెరువు: దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాజమండ్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం టీటీడీ కల్యాణ మండపం రోడ్డులో నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా మాట్లాడుతూ నీట్ పరీక్షపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తగా, మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సంకీర్ణ ప్రభుత్వం లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికే నిర్ణయించుకుందని ఆరోపించారు. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించారన్నారు. చివరకు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేశాక విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారన్నారు. అంతే తప్ప కుంభకోణంపై విచారణ జరిపిస్తామని గానీ, అభ్యర్థులకు న్యాయం చేస్తామని కానీ తెలపలేదన్నారు. కేంద్రం ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా అభ్యున్నతికి నిరంతర పోరాటం



సూర్యారావుపేటలో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న

రాజానగరం: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడం, వారి అభ్యున్నతికి కోసం ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) 50 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తోందని ఆ సంఘ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న అన్నారు. సంఘ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని డివిజన్ నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి అధ్యక్షతన గురువారం సూర్యారావుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసన్న మాట్లాడుతూ 50 ఏళ్ల పోరాటాన్ని, సాధించిన విజయాలను వివరించారు. ఈ పోరాటాల ఫలితమే మహిళల రక్షణ కోసం వచ్చిన చట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, కార్యదర్శి పి. వెంకటనాయుడు, పీఓడబ్ల్యూ ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదారి తీరంలో నాట్య తరంగం



నందిగేశ్వర్ అకాడమీ కళాకారుల ప్రదర్శన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం గురువారం సంగీత, నాట్య ప్రదర్శనలతో తడిసి ముద్దయ్యింది. శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రాధాకృష్ణ కళాక్షేత్ర, రాధాకృష్ణ ట్రస్టు ద్వారా అంతర్జాతీయ సంగీత పోటీలు, ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మరోపక్క పుష్కర ఘాట్‌లో నందిగేశ్వర్ డాన్స్ మ్యూజిక్ అకాడమీ మలేషియా వారిచే భరత నాట్య ప్రదర్శన సంగీత ప్రియులను కట్టిపడేసింది.

సంగీత పోటీలు ప్రారంభం

ఆనం కళాకేంద్రంలో నగర పాలక సంస్థ, గెల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో కళా సమ్మేళన్ ప్రారంభమైంది. నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత, నృత్య పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు రాధాకృష్ణ కళాక్షేత్రకు చెందిన కళాకారులు ఆరంగ్రేటం చేశారు. శుక్రవారం 150 మంది చిన్నారులు కనకధార స్తోత్రాన్ని 16,200 సార్లు పఠిస్తూ నృత్యం చేస్తారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 వరకూ దాదాపు 13 గంటలు నిర్విరామంగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

పుష్కరఘాట్‌లో..

భరతకళ శిఖామణి, ఆడల్ అరసు గురుశ్రీ డాక్టర్ చంద్రమోహన్ రామస్వామి ఆధ్వర్యంలో మలేషియా నుంచి వచ్చిన కళాకారులు తమ నాట్య ప్రతిభతో గోదావరి తీరంలో ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. భరత నాట్య ప్రదర్శనలో గురుశ్రీతో పాటు ఆయన శిష్యులు పాదం కలిపి వీక్షకులను ఆనంద డోలికలలో తెలియాడేలా చేశారు. ఒక పక్క గోదావరి హోరు, మరోపక్క నాట్యాకళాకారులు నాట్య ప్రదర్శనతో ఆ ప్రాంతం మార్మోగింది.

పడమర సిందూరం



రాజానగరం - ఫరిజల్లిపేట దారిలో ఎర్రబడిన ఆకాశం

రాజానగరం: సంధ్యా సమయంలో పక్షులన్నీ గూళ్లకు చేరే వేళలో ఆకాశం ఎర్రబడింది. సూరీడు పడమటకు వెళుతూ సిందూరాన్ని ఆరబోసినట్టుగా ఎర్రబడిన ఆకాశం ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది. రాజానగరం నుంచి ఫరిజల్లిపేట వెళ్లే దారిలో గురువారం సాయంత్రం కనిపించిన ఈ దృశ్యం కనువిందు చేసింది.